క్లుప్తంగా

వ్యర్థాలకు నిప్పు.. వ్యాపించిన మంటలు



స్క్రాప్ దుకాణం వద్ద ఖాళీ స్థలంలో వ్యర్థాల నుంచి వ్యాపిస్తున్న మంటలు, పొగ

మల్కాపురం: జీవీఎంసీ 61వ వార్డు సెయింట్ ఆన్స్ ఆస్పత్రికి వెళ్లే మార్గంలోని ఓ స్క్రాప్ దుకాణం పక్కనున్న ఖాళీ స్థలంలో చెత్తను తగలబెడుతున్నారు. ఇక్కడ వ్యర్థాలు పేరుకుపోవడంతో వాటికి కొంత మంది బుధవారం నిప్పు పెట్టారు. వేసవి ప్రభావానికి వ్యర్థాలు బాగా ఎండిపోవడంతో దట్టమైన తెల్లటి పొగతో మంటలు ఎగసిపడ్డాయి. పక్కన ఉన్న స్క్రాప్ దుకాణానికి వ్యాపించడంతో కొన్ని ప్లాస్టిక్ వ్యర్థాలు దగ్ధమయ్యాయి. చుట్టుపక్కల వారు చూసి ఆ మంటలను అదుపు చేయడంతో ప్రమాదం తప్పింది.

18 నుంచి కనకమహాలక్ష్మి ఆలయంలో చీరల వేలం

డాబాగార్డెన్స్: ఉత్తరాంధ్ర కల్పవల్లి, విశాఖ వాసుల ఆరాధ్యదైవం కనకమహాలక్ష్మికి భక్తులు సమర్పించిన చీరలు వేలం వేయనున్నట్టు ఆలయ ఈవో కె. శిరీష ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 18 నుంచి 21వరకు ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు వేలం కార్యక్రమం ఉంటుందని, భక్తులు అమ్మవారి చీరల వేలంలో పాల్గొనగలరని కోరారు.

కో ఆపరేటివ్ స్టోర్స్ శాఖ ప్రారంభం నేడు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ కో ఆపరేటివ్ స్టోర్స్ నూతన శాఖను గొర్లెవానిపాలెంలో గురువారం ప్రారంభించనున్నారు. దేశపాత్రునిపాలెం, గొర్లివానిపాలెం, పోర్టికో కాలనీ, జాజులవానిపాలెం, గౌతులచ్చన్న, పరవాడ ప్రాంతాలకు చెందిన ఉక్కు ఉద్యోగుల విజ్ఞప్తి మేరకు ఈ శాఖను ఏర్పాటు చేస్తున్నారు. ఉదయం 10 గంటలకు స్టీల్‌ప్లాంట్ హెచ్‌ఆర్ సీజీఎం కె. శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా శాఖను ప్రారంభించనున్నారని కోపరేటివ్ స్టోర్స్ పాలకవర్గం తెలిపింది.

నేడు సహస్ర తులసీదళార్చన

డాబాగార్డెన్స్: కనకమహాలక్ష్మి దేవాలయంలో ప్రతి గురువారం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు సహస్ర తులసిపూజ నిర్వహించనున్నారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,500 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు. భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806091లో చెల్లించాలి. ఆన్‌లైన్ ద్వారా ట్రాన్స్‌ఫర్ చేసిన భక్తులు వివరాలు, పూజ జరిపించాల్సిన వారి పేరు, గోత్రనామాలు, పూర్తి చిరునామా, ఫోన్ నంబరును 8985515989 నంబరుకు వాట్సప్ చేయాలి.

16న ఉక్కు అడ్మిన్ బిల్డింగ్ ముట్టడి



అఖిలపక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఆదినారాయణ

ఉక్కునగరం: ఉక్కు అఖిలపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఈనెల 16న ఉక్కు అడ్మిన్ బిల్డింగ్ ముట్టడి కార్యక్రమం నిర్వహించనున్నారు. బుధవారం స్టీల్‌ప్లాంట్‌లో జరిగిన అఖిలపక్ష పోరాట కమిటీ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో స్టీల్‌ప్లాంట్ కార్మికుల వేతన ఒప్పందం అమలు ఏకైక అజెండాగా ఈ మేరకు తీర్మానించారు. సెయిల్‌లో 2021 డిసెంబర్ నుంచి అమలు చేసినప్పటికీ విశాఖ ఉక్కులో అమలు చేయకపోవడం పట్ల కార్మికుల్లో తీవ్ర అసంతృప్తి నెలకొంది. ఈ నేపథ్యంలో యాజమాన్యంపై ఒత్తిడి తెచ్చేందుకు ముట్టడి కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో అఖిలపక్ష నాయకులు డి. ఆదినారాయణ, కె.ఎస్.ఎన్.రావు, నీరుకొండ రామచంద్రరావు, కారు రమణ, జె. అయోధ్యరామ్, యు. రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఇష్టానుసారంగా పార్కింగ్

- ఇరుకు రోడ్లలో కార్లు, ఆటోల నిలిపివేత
- ఇబ్బందులు పడుతున్న స్థానికులు, పాదచారులు
- అధికారులు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి



శ్రీహరిపురం నాగేంద్ర పాఠశాలకు వెళ్లే మార్గంలో కార్ల పార్కింగ్



కొత్త రామాలయానికి వెళ్లే మార్గంలో నిలిపిన కార్లు, ఆటోలు

మల్కాపురం: అసలే ఇరుకు రోడ్లు.. ఆపై ఇబ్బందికరంగా వాహనాల పార్కింగ్‌తో స్థానికులు, పాదచారులకు అవస్థలు తప్పడం లేదు. 60వ వార్డు శ్రీహరిపురంలోని నాగేంద్ర పాఠశాలకు వెళ్లే రోడ్డు, శ్రీహరిపురం నుంచి జవహర్ నగర్ కొత్త రామాలయానికి వెళ్లే మార్గాల్లో పరిస్థితి ఇది. ఇక్కడ పలువురు నివాసులు తమ కార్లు, ఆటోలను ఇష్టానుసారంగా పార్క్‌చేస్తున్నారు. ఈ రోడ్డు 8 నుంచి 10 అడుగుల వెడల్పుతో ఉంటుంది. ఇరుకు రోడ్లతో సతమతమవుతున్న కాలనీవాసులకు ఇప్పుడు కొత్తగా సర్వీస్ రోడ్లలో కార్లు, ఆటోల పార్కింగ్ సమస్య తలపోటుగా మారింది.

సాయంత్రమైతే చాలు..

నిజానికి కార్లు ఉన్న వారు తమ ఇంటి దిగువ సెల్లార్ ఏర్పాటు చేసుకుని పార్క్ చేసుకోవాల్సి ఉంది. ఆటో వారైతే స్టాండ్‌లో గానీ విశాలమైన ప్రదేశాల్లో గానీ పార్క్ చేసుకోవాలి. నలుగురు నడిచే దారిలో వాహనాలను నిలపడం వల్ల ఇబ్బంది పడుతున్నామని పలువురు స్థానికులు చెబుతున్నారు. ప్రతి రోజు సాయంత్రం 6 నుంచి మరుసటి రోజు ఉదయం 7 గంటల వరకు ఈ సమస్య ఎక్కువగా ఉంటుందని వాపోతున్నారు. అర్ధరాత్రి సమయంలో కాలనీ వాసులకు ఏదైనా అనారోగ్య సమస్య వస్తే.. వారిని ఆస్పత్రికి తరలించేందుకు అంబులెన్స్ కూడా రాలేనే పరిస్థితి నెలకొంది. సంబంధిత అధికారులు పరిశీలించి ఈ సమస్యకు తగు పరిష్కారం చూపాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

ఇబ్బంది పడుతున్నాం



నా మిత్రుడికి ఆరోగ్య బాగోలేకుంటే ఆస్పత్రికి తీసుకెళ్లేందుకు అంబులెన్స్‌కు ఫోన్ చేశాం. కొత్త రామాలయం వద్ద ఇరుకు రోడ్డు.. ఆపై అక్కడ పార్కు చేసి ఉన్న ఆటోలను చూసి అంబులెన్స్ లోపలికి రాలేక పోయింది. దీంతో ద్విచక్ర వాహనంపైనా ఆస్పత్రికి తీసుకెళ్లాల్సి వచ్చింది. ఇరుకు రోడ్డులో పార్కింగ్‌తో ఇబ్బంది ఎదుర్కొంటున్నాం.

– బి.శ్రీనివాసరావు, శ్రీహరిపురం

అధికారులు స్పందించాలి



కొత్త రామాలయం వీధి, నాగేంద్ర పాఠశాల వీధి వద్ద పలువురు కార్లు, ఆటోలను పార్క్‌చేస్తున్నారు. ఈ కారణంగా ఈ మార్గాల్లో నడవడానికే ఇబ్బందిగా ఉంది. ముఖ్యంగా రాత్రి సమయంలో ఈ సమస్య మరింత ఎక్కువగా ఉంది. సంబంధి అధికారులు చర్యలు చేపట్టాలి.

– అన్నెపు సూర్యనారాయణ, జవహర్ నగర్

పోస్ట్‌కార్డు ఉద్యమం జయప్రదానికి పిలుపు



మాట్లాడుతున్న జోన్ కార్యదర్శి నూకరాజు

మల్కాపురం: ప్రధాని నరేంద్రమోదీకి తెలిసేలా ఈపీఎఫ్ పెన్షనర్లంతా ఆయనుకు పోస్ట్‌కార్డుల ద్వారానిరసన సందేశాన్ని పంపాలని పెన్షనర్స్ సంఘం జోన్ కార్యదర్శి నూకరాజు పిలుపునిచ్చారు. 61వ వార్డు వెంకన్నపాలెంలోని సీఐటీయూ కార్యాలయంలో బుధవారం పారిశ్రామిక ప్రాంత పెన్షనర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పింఛన్‌దారుల విషయంలో సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును కేంద్ర ప్రభుత్వం ఆచరించడం లేదన్నారు. తమ సమస్యలు పరిష్కరించాలని కేంద్రానికి ఎన్నిసార్లు మొర పెట్టుకున్నా.. పట్టనట్టు వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర పాలకుల నిర్లక్ష్య వైఖరికి నిరసనగా పోస్ట్‌కార్డ్ ఉద్యమానికి శ్రీకారం చుట్టామని చెప్పారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు తమ్మారావు, ఎస్.కె.హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

‘మాల్-ఖానా’ ఏర్పాటు



కంచరపాలెం పోలీస్ స్టేషన్ టెర్రస్‌పై బ్లాక్‌లను పరిశీలిస్తున్న సీఐ విజయ్‌కుమార్

మర్రిపాలెం: నగర పోలీస్ కమిషనర్ త్రివిక్రమ్ వర్మ ఆదేశాల మేరకు కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్‌లో ‘మాల్-ఖానా’ ఏర్పాటు చేస్తున్నట్టు సీఐ ఎస్.విజయ్‌కుమార్ తెలిపారు. బుధవారం స్టేషన్ టెర్రస్‌పై ఈ బ్లాక్‌లను ఏర్పాటు చేశామన్నారు. పెరుగుతున్న టెక్నాలజీకి అనుగుణంగా ఈ కోడ్‌ను తయారు చేసినట్టు చెప్పారు. కేసులు నమోదైన తర్వాత సంబంధిత వస్తువులను కోర్టులో ప్రవేశపెట్టడానికి వాటిని పోలీసులు స్వాధీనం చేసుకుంటారన్నారు. నేరాలను బట్టి నిందితుల ఉపయోగించిన పరికరాలను జాగ్రత్తగా కోర్టులో ప్రవేశపెట్టడానికి ఉపయోగపడేలా మాల్ ఖానా తయారు చేస్తున్నట్టు తెలిపారు. దీని ద్వారా ఎప్పుడు ఏ నేరం ఎలా జరిగింది, అంతేకాక కోర్టులో ప్రవేశపెట్టడానికి సులభతరంగా ఉంటుందన్నారు. ఎన్ని ఏళ్లు గడిచినా, ఎంతమంది సిబ్బంది మారినా.. మాల్-ఖానా ద్వారా రికవరీ ప్రాపర్టీ ఎక్కడో తెలుసుకునేందుకు వీలుగా ఉంటుందని సీఐ వివరించారు.

మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య

గోపాలపట్నం: మనస్తాపం చెంది ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన వెంకటాపురం గొల్ల వీధిలో జరిగింది. గోపాలపట్నం పోలీసులు తెలిపిన వివరాలిలా.. జీవీఎంసీ 92వ వార్డు గొల్ల వీధికి చెందిన ఉరుకూటి ఈశ్వరరావు(32) రాడ్ బెండింగ్ పని చేసేవాడు. అతడికి తల్లిదండ్రులు, భార్య, రెండు నెలల బాబు ఉన్నాడు. భార్య ప్రసవం నిమిత్తం అక్కయ్యపాలెంలోని పుట్టింటికి వెళ్లింది. బుధవారం సాయంత్రం ఈశ్వరరావు తల్లిదండ్రులు బయటకు వెళ్లారు. ఇంట్లో ఎవరూ లేని సాయంత్రం 6 గంటల సమయంలో ఇంటి శ్లాబ్ హుక్‌కి ఉరి వేసుకుని మృతి చెందాడు. మృతికి గల కారణాలు ఇంకా తెలియరాలేదని, కేసు దర్యాప్తు చేస్తున్న ఎస్ఐ రామకృష్ణ తెలిపారు. అయితే ఇటీవల ఈశ్వరరావు భార్యకు అనారోగ్యంతో కొడుకు పుట్టాడని, దీంతో మనస్తాపానికి గురయ్యాడని స్థానికులు చెబుతున్నారు. మృతుడి తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. మృతదేహాన్ని కేజీహెచ్‌కు తరలించారు.

సీజీఆర్ఎఫ్‌తో విద్యుత్ వినియోగదారులకు న్యాయం



విద్యుత్ వినియోగదారులతో మాట్లాడుతున్న సీజీఆర్ఎఫ్ చైర్మన్ సత్యనారాయణ

అక్కిరెడ్డిపాలెం: విద్యుత్ వినియోగదారులు తమ సమస్యల పరిష్కారానికి కన్స్యూమర్స్ గ్రీవెన్స్ రీడ్రసల్ ఫోరం (సీజీఆర్ఎఫ్) ద్వారం న్యాయం పొందవచ్చని సీజీఆర్ఎఫ్ చైర్మన్ జస్టిస్ డాక్టర్ బి.సత్యనారాయణ అన్నారు. ఆటోనగర్ ఐలా భవనంలో బుధవారం ఆంధ్రప్రదేశ్ తూర్పుప్రాంత విద్యుత్ పంపిణీ వ్యవస్థ (ఏపీఈపీడీసీఎల్) ఆధ్వర్యంలో వినియోగదారుల సమస్యల పరిష్కార న్యాయస్థానం (సీజీఆర్ఎఫ్) నిర్వహించారు. ఈ సందర్భంగా ఆటోనగర్‌లో విద్యుత్ సమస్యలపై ఎదుర్కొంటున్న పలు ఇబ్బందులను పారిశ్రామికవేత్తలు చైర్మన్ దృష్టికి తీసుకువచ్చారు. జోన్ – 2 ఈఈ బీకే నాయుడు మాట్లాడుతూ ఆటోనగర్ విద్యుత్ పనులకు రూ.1.6 కోట్లు ఖర్చు చేశామన్నారు. ఏ-బ్లాక్‌లో నివాసిత ప్రాంతాలకు, పరిశ్రమలకు ఒకే విద్యుత్ లైన్లు కొనసాగుతుండటంతో పరిశ్రమలకు ఏర్పడుతున్న ఇబ్బందులపై పారిశ్రామికవేత్త నాగిరెడ్డి తెలిపారు. విద్యుత్ వైర్లకు అంతరాయం అంటూ చెట్లను నరికివేస్తున్నారని పారిశ్రామికవేత్త పాండురంగ ప్రసాద్ తెలిపారు. చైర్మన్ జస్టిస్ డాక్టర్ సత్యనారాయణ మాట్లాడుతూ విద్యుత్ సమస్యలను టోల్ ఫ్రీ నంబర్ 1912కి ఫిర్యాదు చేయవచ్చన్నారు. పరిష్కారం కాని ఎడల సీజీఆర్ఎఫ్‌కు వ్యక్తిగతంగా గానీ, తపాల ద్వారా గానీ, ఆర్‌లైన్ ద్వారా, ఈమెయిల్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చన్నారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కేవీ స్వామి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎస్ఈ ఎల్.మహేంద్రనాథ్, మెంబర్ ఆఫ్ టెక్నికల్ పి.శ్రీనివాస్, ఆర్.సురేంద్రకుమార్, గాజువాక డిప్యూటీ ఈఈ సీహెచ్ మీనకేతనరావు, ఆటోనగర్ ఈఈ ఏ.పార్థసారధి, ఏఈలు ఎం.భీమరాజు పాల్గొన్నారు.

ప్రజలకు అండగా జగనన్న సర్కారు

- వైఎస్సార్‌సీపీ ‘పశ్చిమ’ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్
- 61, 62 వార్డుల్లో ‘గడప గడపకు మన ప్రభుత్వం’



62వ వార్డులో సంక్షేమ పథకాల కరపత్రాలను అందిస్తున్న ఆనంద్‌కుమార్



61వ వార్డులో లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఆడారి ఆనంద్‌కుమార్

మల్కాపురం: అన్ని వర్గాల ప్రజలకు అండగా జగనన్న ప్రభుత్వం నిలుస్తోందని వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ అన్నారు. 61వ వార్డు ఆర్‌కే పురంలో బుధవారం ఉదయం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. అతిథిగా ఆయన మాట్లాడుతూ పేదల కష్టాలను తొలగించాలనే ఆలోచనతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలను రూపొందించి అమలు చేస్తున్నారని తెలిపారు. అవినీతికి తావు లేకుండా నేరుగా లబ్ధిదారులకే ఇళ్లు అందజేస్తున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో మళ్లీ వైఎస్ జగన్‌నే ముఖ్యమంత్రిని చేయాలని స్థానిక ప్రజలను ఆడారి అభ్యర్థించారు. కార్పొరేటర్ కొణతాల సుధ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కలిదిండి బద్రీనాథ్, నాయకులు దాడి సత్యనారాయణ, సోనూ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ ప్రభుత్వం

సింధియా: ప్రజా సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ అన్నారు. 62వ వార్డు దుర్గానగర్‌లో కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావు ఆధ్వర్యంలో బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం కొనసాగింది. ముఖ్య అతిథులు ఆడారి, జిల్లా ట్రేడ్ యూనియన్ నాయకుడు కలిదిండి బద్రీనాథ్ 300 గడపలను సందర్శించి ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తీరును అడిగి తెలుసుకున్నారు. స్థానికుల సమస్యలు తెలుసుకుని సంబంధిత అధికారులకు తెలియజేసి సత్వరమే పరిష్కరించాలని సూచించారు.

సామాజిక భవనం ప్రారంభం

దుర్గానగర్‌లో సుమారు రూ.15 లక్షల జీవీఎంసీ నిధులతో నిర్మించిన సామాజిక భవనాన్ని వార్డు నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆడారి ఆనంద్‌కుమార్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ భవిష్యత్తులో మరిన్ని సంక్షేమ పథకాలను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టనున్నారని చెప్పారు. ప్రతి ఒక్కరూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని ఆదరించాలని ఆయన కోరారు. అనంతరం మల్కాపురం ప్రకాష్‌నగర్‌లో అనారోగ్యంతో బాధపడుతున్న సూరిశెట్టి రాహుల్‌ను ఆనంద్‌కుమార్ పరామర్శించి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో భీశెట్టి గణేష్, సోషల్ మీడియా కో-కన్వీనర్ గుడాల బాబూరావు, రామకృష్ణ, మహిళా నాయకురాలు భారతి, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

సమాచారమ్

అందుబాటులో జోన్-5 అధికారులు



జీవీఎంసీ జోన్-5 కార్యాలయం

కంచరపాలెం: ప్రజలకు సేవలందించడంలో జీవీఎంసీ జోన్-5 అధికారులు అందుబాటులో ఉన్నారు. జోన్ పరిధిలో ఉత్తర, పశ్చిమ నియోజకవర్గాలకు సంబంధించి 40 నుంచి 63 వరకు మొత్తం 24 వార్డులు ఉన్నాయి. జోన్ ప్రజలు తమ సమస్యల పరిష్కారం, సందేహాల నివృత్తి కోసం అధికారులను వారి ఫోన్ నంబర్లలో సంప్రదించి తెలియజేయవచ్చు. ప్రతి సోమవారం జ్ఞానాపురంలోని జోన్-5 కార్యాలయంలో నిర్వహించే స్పందన కార్యక్రమంలో ప్రజలు నేరుగా అధికారులకు వినతిపత్రాలు అందజేయవచ్చు.

జీవీఎంసీ జోన్-5 అధికారుల వివరాలు

అధికారి పేరు	బాధ్యత	ఫోన్ నంబర్
ఆర్.జి.వి.కృష్ణ	జోనల్ కమిషనర్ ప్రథమ అప్పిలేట్ అధికారి	97050 86888
టి.ఎస్.ఎస్.రాజు	సూపరింటెండెంట్-1 పబ్లిఐవో(రెవెన్యూ, ఇంజినీరింగ్, ఎస్టాబ్లిష్‌మెంట్)	99481 25699
ఆర్.వి.రమణ	సూపరింటెండెంట్-2 ఎఐవో(టౌన్ ప్లానింగ్, పబ్లిక్ హెల్త్, యూసీడీ)	99897 84585
ఎ.శ్రీనివాస్	ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జోన్-ఏ డీమ్డ్ పీఐవో(ఇంజనీరింగ్ విభాగం)	99480 78507
టి.ప్రసన్నరెడ్డి	ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జోన్-బీ డీమ్డ్ పీఐవో (ఇంజనీరింగ్ విభాగం)	79979 54406
ఆర్.బాబూరావు	రెవెన్యూ కమిషనర్ డీమ్డ్ పీఐవో	88972 10764
ఐ.వి.రమణమూర్తి	అసిస్టెంట్ సిటీ ప్లానర్ డీమ్డ్ పీఐవో(టౌన్ ప్లానింగ్)	81878 99199
ఎం.శ్రీలక్ష్మి	టౌన్ ప్లానింగ్ అధికారి(టీపీవో)	70932 87310
డాక్టర్ ఎ.రాజేష్	పబ్లిక్ హెల్త్ ఏఎంహెచ్‌వో	99480 95520
సూరిశెట్టి శేఖర్	ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జోన్-బీ డీమ్డ్ పీఐవో (వాటర్ వర్క్స్)	99480 78503
శ్రీనివాస్ వర్మ	డీప్యూటీ ఇంజనీర్ డీమ్డ్ పీఐవో (వాటర్ వర్క్స్)	99123 49448
కె.శైలజ	టీపీఆర్‌వో, ఏపీడీ డీమ్డ్ పీఐవో (యూసీడీ)	97013 85284

ఘంటసాల నాటకం పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న మేయర్ వెంకటకుమారి, బాదంగీర్ సాయి తదితరులు

అల్లిపురం: గాన గంధర్వుడు ఘంటసాల వెంకటేశ్వర రావు జీవిత చరిత్ర ఆధారంగా రూపొందించిన నాటకం పోస్టర్‌ను నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి ఆవిష్కరించారు. మేయర్ ఛాంబర్‌లో బుధవారం ఆమెను రంగసాయి గ్రంథాలయ వ్యవస్థాపకుడు బాదంగీర్ సాయి, సీనియర్ జర్నలిస్ట్ ఎస్.నాగేశ్వరరావు మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆమె రంగసాయి నాటక గ్రంథాలయం శాశ్వత నిధుల సమీకరణకు నిర్వహిస్తున్న ఘంటసాల నాటకం ప్రతి ఒక్కరూ చూడాలని పిలుపునిచ్చారు. ఈ నెల 28వ తేదీ సాయంత్రం మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలో రెండు ప్రదర్శనలుగా ఈ నాటకాన్ని ప్రదర్శిస్తున్నట్టు బాదంగీర్‌సాయి తెలిపారు. స్టేషన్ ఘన్‌పూర్‌కు చెందిన శ్రీ సాయి సంతోషి నాట్యమండలి, సురభి కళాకారులు ఈ నాటకాన్ని ప్రదర్శిస్తున్నారని తెలిపారు. దేశంలోనే మొట్టమొదటి సారిగా నాటక గ్రంథాలయాన్ని విశాఖలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాటక గ్రంథాలయ పాలకులు జమ్మా చిన్నబాబు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళకు తీవ్ర గాయాలు



సురక్షితంగా బయటపడ్డ చిన్నారి పరిమళ



ప్రమాదంలో తీవ్రగాయాలపాలైన రుత్తల లక్ష్మి

అక్కిరెడ్డిపాలెం: మల్కాపురం రామకృష్ణాపురానికి చెందిన రుత్తల లక్ష్మి (47) ఆమె బంధువైన యువకుడు ఎల్.రాజు స్కూటీ డ్రైవ్ చేస్తుండగా పరిమళ (8) చిన్నారితో కలిసి సబ్బవరం మామిళ్లవానిపాలెంలో ఒక వివాహానికి వెళ్తున్నారు. వీరు హోండా స్కూటీపై బుధవారం తెల్లవారు జామున బీహెచ్‌పీవీ సిగ్నల్ పాయింట్ నుంచి షీలానగర్ వైపు మలుపు తిరుగుతున్నారు. ఇదే సమయంలో ఆటోనగర్ సిగ్నల్ పాయింట్ నుంచి షీలానగర్ వైపు వస్తున్న కంటైనర్ లారీ ద్విచక్ర వాహనానికి తగిలింది. దీంతో వాహనం అదుపు తప్పి వెనుక కూర్చున్న లక్ష్మికి పొట్ట, ఎడమ తొడ, నడుము వద్ద తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే ఆమెను షీలానగర్‌లోని ఒక ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ప్రమాదంలో చిన్నారి పరిమళ, యువకుడు రాజు సురక్షితంగా బయటపడ్డారు. గాజువాక పోలీసులు కంటైనర్ లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ ఎల్.భాస్కరరావు తెలిపారు. అదే విధంగా ఎయిర్ పోర్టు దాటిన వెంటనే ద్విచక్ర వాహనంపై వెళ్తున్న ఇద్దరు వాహనంతో పాటు జారి పడ్డారు. వీరి వెనుక వస్తున్న వ్యాను సడన్ బ్రేక్ వేయడంతో వ్యాను వెనుక వచ్చిన బొలేరో వ్యానును ఢీకొట్టింది. పోలీసులకు ఫిర్యాదు చేయకపోవడంతో ఎవరికి వారే స్వచ్ఛందంగా వెళ్లిపోయారు.

ఎరుకుమాంబకు జలాభిషేకం



జలాభిషేకం చేస్తున్న భక్తులు

సీతమ్మధార: దొండపర్తిలో వెలసిన ఎరుకుమాంబ ఆలయంలో అమ్మవారికి భక్తులు స్వహస్తాలతో జలాభిషేకం చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా ఆలయ ఈవో రామాబాయి ఆధ్వర్యంలో అర్చకుడు శ్రీనివాస్ అమ్మవారిని పూజించారు. ఉదయం గణపతి పూజ, అమ్మవారికి భక్తుల గోత్రనామాలతో అభిషేకాలు చేశారు. పంచామృతాభిషేకం అనంతరం విశేష పూజలు జరిపారు. సాయంత్రం అమ్మవారిని పసుపుతో అలంకరించి, హారతులిచ్చారు. అమ్మవారు భక్తులకు ప్రత్యేక అలంకరణలో దర్శనమిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

ప్రతిపాదన వెనక్కి తీసుకోవాలి



818వ రోజు దీక్షలో పాల్గొన్న ఉక్కు పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కు కర్మాగారం అమ్మకపు ప్రతిపాదనను కేంద్ర ప్రభుత్వం తక్షణమే వెనక్కి తీసుకోకపోతే తీవ్ర పరిణామాలు ఎదుర్కోక తప్పదని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు హెచ్చరించారు. ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్షలు బుధవారం నాటికి 818వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలో ట్రాఫిక్ విభాగం కార్మికులు పాల్గొని కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దేశ ప్రజల ఆస్తిని కార్పొరేట్ సంస్థలకు అమ్మడం అంటే తల్లి పాలు తాగి రొమ్ము గుద్దడమే అవుతుందని విమర్శించారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం తన ఆలోచనను వెనక్కి తీసుకోవాలని, లేనిపక్షంలో తమ ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

వృద్ధురాలికి ఆశ్రయం



వృద్ధురాలిని ఆశ్రమానికి తరలిస్తున్న మమత

అల్లిపురం: ఒక వృద్ధురాలిని ఎవరో కేజీహెచ్‌లో జాయిన్ చేసి వెళ్లిపోయారు. ఆమె వివరాలు తెలియజేసే పరిస్థితిలో లేదు. ఆమెను తీసుకెళ్లేందుకు ఎవరూ రాకపోవడంతో మమత చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకురాలు ఎల్లేటి మమతకు కేజీహెచ్ ఉద్యోగులు సమాచారం అందజేశారు. దీంతో ఆమె వెంటనే స్పందించి కేజీహెచ్ నుంచి వృద్ధురాలిని డిశ్చార్జి చేయించి మన కుటుంబం వృద్ధాశ్రమంలో ఆశ్రయం కల్పించారు.